




RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 308 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 22-02-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

# ఢిల్లీలో ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

## ఆలయాలే లక్ష్యంగా దాడికి స్కెచ్



- నిఘా వర్గాల హెచ్చరికలు జారీ
- ఇతర నగరాల్లోనూ పేలుళ్లకు కుట్ర

**ప్రముఖ ఆలయాలు, ఎర్రకోట టార్గెట్..**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దేశ రాజధాని దిల్లీలో మరోసారి పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబా కుట్ర పన్నింది. ఈ మేరకు నిఘా వర్గాలు హెచ్చరించాయి. దీంతో దిల్లీ పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందీనీ చౌక్ ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా ఎల్ ఈటీ దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి.

-మిగతా 2 లో



### దేశం నుంచి చొరబాటుదార్లను
# తరిమేస్తాం

- ఓటరు జాబితాతో పాటు, దేశంలోనూ స్థానం లేకుండా చేస్తాం
- కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక

**గౌహతి**
నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని

-మిగతా 2 లో

### కాంగ్రెస్‌లో కష్టపడితేనే
# పదవులు

## డీసీసీ అధ్యక్ష పదవి ఎదిగేందుకు తొలిమెట్టు

- అవకాశాలను అందిపుచ్చుకుని సాగాలి
- ఎవ్వరికైనా మెరిట్ లిస్ట్ ప్రకారమే అవకాశం
- భిన్నాభిప్రాయాలు పార్టీ కార్యకర్తల స్థయిర్యాన్ని దెబ్బతీస్తాయి
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి

**వికారాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గాంధీ సిద్దాంతాలను విశ్వసించే పార్టీ కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. రిజర్వేషన్లను రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని విమర్శించారు.రెండు తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం వికారాబాద్ జిల్లా అనంతగిరిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఈ శిక్షణ డీసీసీ అధ్యక్షులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వారి అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ విధానాలు, ప్రజల సమస్యలపై చర్చించేందుకు

-మిగతా 2 లో






### అమెరికాతో ఒప్పందం
# రైతాంగానికి నష్టం

- దేశ రైతులతో పాటు తెలంగాణకు ముప్పే
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ఇటీవల చేసుకున్న ఒప్పందాల వల్ల తెలంగాణ రైతులతో పాటూ దేశంలోని రైతులు తీవ్ర నష్టానికి గురయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అమెరికాలో సాగవుతున్న జొన్న, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి వంటి పంటలను భారతదేశంలోకి ఎలాంటి టాక్స్ లేకుండా అనుమతించడం వల్ల మన దేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న రైతులతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న రైతులు ప్రమాదంలో పడతారని తెలిపారు.

-మిగతా 2 లో



# పాక్‌లో ఆత్మాహుతి దాడి

- పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో ఈ దాడి
- ఈ ఘటనలో ఇద్దరు పాక్ సైనికులు, ఐదుగురు ఉగ్రవాదులు సహా మొత్తం 16 మంది దుర్మరణం
- ఆ దేశంలో 15 రోజుల వ్యవధిలో ఇది మూడో ఆత్మాహుతి దాడి
- ఐదు రోజుల్లో రెండోది కావడం గమనార్హం.

**లాహోర్,**
పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులో శనివారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు పాక్ సైనికులు, ఐదుగురు ఉగ్రవాదులు సహా మొత్తం 16 మంది మరణించారు. మృతులలో లెఫ్టినెంట్ కల్నల్ స్థాయి అధికారితో పాటు పౌరులూ ఉన్నట్టు సమాచారం. అనేక మంది సైనికులు గాయపడ్డారు. ఆ దేశంలో 15 రోజుల వ్యవధిలో ఇది మూడో ఆత్మాహుతి దాడి కాగా.. ఐదు రోజుల్లో రెండోది కావడం గమనార్హం. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని బన్ను జిల్లా సరార్ దర్గా ప్రాంతంలో ఈ దాడి జరిగింది. పేలుడు పదార్థాలతో కూడిన ఓ వాహనాన్ని పాక్ భద్రతా దళాలు అడ్డుకున్నాయి. దీంతో ఆత్మాహుతి దళ సభ్యుడు సైనిక కాన్వాయ్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. అయితే.. సైన్యానికి చెందిన వాహనం దాడులను తట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించినది కావడంతో పేలిపోలేదు.

-మిగతా 2 లో

# ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

- గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు
- వివరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం




2 లో

# ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే




- అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్
- కారిడార్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ**
ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు.

-మిగతా 2 లో

### అవినీతి నిరూపిస్తే
# వెంటనే రాజీనామా

- ప్రజలకు ఎవరేంటో తెలుసు
- తనపై దాడి చేసేందుకు షబ్బీర్ కుట్ర
- ఇక ప్రజల్లో ఉంటే తేల్చుకుంటా
- తనకేదైనా జరిగితే సీఎం రేవంత్‌దే బాధ్యత
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హెచ్చరిక



**కామారెడ్డి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి

-మిగతా 2 లో

### కామారెడ్డిలో
# హైటెన్షన్

## పరస్పరం దాడి చేసుకున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆఫీస్ ముట్టడి
- కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత
- తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం
- పోలీసులు రంగంలోకి దిగడంతో అదుపులోకి పరిస్థితి

2 లో



### భారత్ టారిఫ్‌లు
# కట్టాల్సిందే..

- సుప్రీంకోర్టు తీర్పుతో మారేదేమీ లేదు..
- ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు విధించిన టారిఫ్‌లు చెల్లవని ఆ దేశ సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ ఏ మాత్రం తగ్గలేదు. ప్రపంచ దేశాలపై మళ్లీ 10 శాతం సుంకాలను విధించారు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు సంబంధిత ఉత్తర్వులపై ట్రంప్

-మిగతా 2 లో

## ఢీల్లీలో ఉగ్రకుట్రకు లష్కరే ప్లాన్

మొదటి తరువాయి

చాందీనీ చౌక్ ప్రాంతంలోని ఒక దేవాలయంపై ఐఈడీతో దాడి చేసేందుకు ఉగ్రవాదులు వ్యూహం పన్నుతున్నట్లు నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారంగా, భారత్‌లోని ప్రముఖ ధార్మిక స్థలాలపై దాడులు చేయాలని లష్కరే ప్లాన్ చేస్తోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి. కేవలం దిల్లీలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లోని ప్రముఖ దేవాలయాలు కూడా ఉగ్రవాదుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. గత ఏడాది నవంబర్ 10న ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడులో 12 మంది మరణించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనపై దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో మరోసారి ఎర్రకోట పరిసర ప్రాంతాలపై ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాల నుంచి హెచ్చరికలు రావడం దేశ రాజధానిలో కలకలం రేపుతోంది.

## దేశం నుంచి చొరబాటుదార్లను తరిమేస్తాం

మొదటి తరువాయి

గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు‘ అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు.రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

## పాక్‌లో ఆత్మాహుతి దాడి

మొదటి తరువాయి

దీనివల్ల వాహనానికి తీవ్ర నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. పేలుడు ధాటికి ఓ నిఘా సంబంధిత ఆపరేషన్లో పాల్గొంటున్న కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ షాజాదా గుల్ మృతిచెందినట్టు సమాచారం. అయితే.. అగానిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఇటీవలి కాలంలో ఉగ్ర సంఘటనలు పెరిగాయి. కొద్ది రోజుల క్రితం.. తెహ్రిక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్(టీటీపీ) బజౌర్ జిల్లాలోని ఓ చెక్‌పాయింట్‌ను పేలుడు పదార్థాలతో కూడిన వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో 11 మంది భద్రతా సిబ్బంది సహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే మలంగిలోని ఓ మదర్సా ఉన్న భవనం వద్ద కూడా భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో భవనం పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు ధాటికి పరిసర ప్రాంతాల్లోని భవనాలు సహా అనేక ఇళ్లు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే

మొదటి తరువాయి

తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.

## కామారెడ్డిలో హైటెన్షన్

- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటర మణారెడ్డి ఆఫీస్ ముట్టడి
- కాంగ్రెస్ కార్యకర్తల దాడితో ఉద్రిక్తత
- తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం
- పోలీసులు రంగోలకి దిగడంతో అదుపులోకి పరిస్థితి




**కామారెడ్డి, , ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటర మణారెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి ఎమ్మెల్యే ఇంటి ముట్టడికి వచ్చారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మహేందర్‌రెడ్డి కారును భాజపా కార్యకర్తలు ధ్వంసం చేశారు. అడ్డుకునే
ప్రయత్నం చేసిన పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో హైటెన్షన్ నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మధ్య మాటల యుద్ధం ఉద్రిక్తతలకు దారితీసింది. కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేత గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ప్రయత్నించడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ప్రభుత్వ, అరోరా కాలేజీ భూములను వెంకట రమణారెడ్డి కబ్జా చేశారని షబ్బీర్ ఇటీవల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన వెంకట రమణారెడ్డి.. ప్రభుత్వ కాలేజీ భూములు, శిశుమందిర్ పాఠశాల, అరోరా కాలేజీ విషయంలో కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలపై తాను చర్చకు సిద్ధమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజలకు నిజాలు తెలియాల్సిన అవసరం ఉందని.. సాక్ష్యాధారాలతో చర్చకు రావాలని ఎమ్మెల్యే సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో శిశుమందిర్ వేదికపై బహిరంగ చర్చకు రెండు పార్టీలు సిద్ధమయ్యాయి. ఇరు పార్టీల నేతల సవాళ్లతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి క్యాంప్ ఆఫీసు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. క్యాంప్ ఆఫీసు నుంచి బయటకు రాకుండా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేశారు. మరోవైపు సవాలును స్వీకరించిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. మాజీ సర్పంచ్ గిరిరెడ్డి మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన బీజేపీ కార్యకర్తలు అక్కడకు చేరుకుని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ముదరడంతో మహేందర్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. కారును బోల్తా పడేశారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరు పార్టీల నేతలను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కాంగ్రెస్‌లో కష్టపడితేనే పదవులు

మొదటి తరువాయి

ఈ తరగతులు సహాయపడతాయని సీఎం అన్నారు. గాంధీజీపై లాఠీలు ఎత్తడానికి బ్రిటిషర్లు బయపడ్డారని, దేశభక్తులమని అనుకునే కొందరు తూటాలతో గాంధీని చంపారని విమర్శించారు. పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయని, గాంధీ ఆలోచనలపై కూడా భిన్నాభిప్రాయాలు చెప్పినవారు ఉన్నారని తెలిపారు. 'భిన్నాభిప్రాయాలు చెప్పిన వారిని తరిమేస్తే మనకే నష్టం.. అందరూ కలిసి పనిచేస్తే అనుకున్నది సాధించవచ్చు' అని రేవంత్ అన్నారు. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు.రెండున్నర శాతం ఓట్ల నుంచి 40 శాతం వరకు కాంగ్రెస్ పార్టీని తీసుకొచ్చామన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌పై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ బాధ్యతలు తీసుకున్న వారిని వెతికి మరీ పదవులు ఇచ్చామని సీఎం చెప్పుకొచ్చారు. నాయకుల ప్రతీ కదలికను గమనిస్తూనే ఉంటామని.. మెరిట్ కోటా తప్ప కాంగ్రెస్‌లో ఏ కోటా లేదని స్పష్టం చేశారు. మెరిట్ కోటాలో పాస్ అయితేనే పదవులు వస్తాయని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి చాలా విలువైనదని.. ఈ పదవిని దుర్వినియోగం చేస్తే దేవుడు కూడా కాపాడలేడన్నారు. 'డీసీసీ అధ్యక్ష పదవి మీ ఉన్నతికి తొలిమెట్టు' అని పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనాయకులను అవమానపరచాలని బీజేపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఉండడానికి సొంత ఇల్లు కూడా లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలపై సీఎం రేవంత్ రెడ్డి పొగడ్తల వర్షం కురిపించారు. రాజకీయ వారసత్వం నుంచి షర్మిల వచ్చినా ఆమె అవకాశాలను తీసుకోలేదన్నారు. ముళ్లబాటలో కూడా ఏపీలో కాంగ్రెస్ కోసం షర్మిల కష్టపడుతున్నారని తెలిపారు. ప్రజల దగ్గరికి వెళ్ళి రాజకీయాల్లో రాణించాలని షర్మిల చేస్తున్న కృషిని ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాగా, డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరయ్యారు. అలాగే, రెండు రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది డీసీసీ అధ్యక్షులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు

## అమెరికాతో ఒప్పందం రైతాంగానికి నష్టం

మొదటి తరువాయి

మన దేశంలో కూడా అన్నదాతలు మొక్కజొన్న, జొన్న, సోయాబీన్, పత్తి పంటలని ఎక్కువగా పండిస్తూ జీవనం సాగిస్తున్నారని వివరించారు. అమెరికా దేశం నుంచి ఈ పంటలను దిగుమతి చేసుకోవడం వల్ల తెలంగాణలో ఉన్న రైతులంతా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో రైతులకు సంబంధించిన ఓ కార్యక్రమానికి హరీశ్‌రావు ఇవాళ (శనివారం) హాజరయ్యారు. వివిధ స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయం చేస్తే మంచి లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా రావడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. కేవలం 12 గంటల పాటే విద్యుత్ సరఫరా ఇస్తున్నారని, ఎరువులు సకాలంలో అందడం లేదని చెప్పుకొచ్చారు. అన్నదాతల సమస్యలను త్వరలో జరిగే రాష్ట్ర బ్జడెట్ సమావేశాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు, ట్రాక్టర్లు సబ్సిడీకి ఇచ్చే విధంగా బ్జడెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# ఆరు రాష్ట్రాల్లో పూర్తయిన సర్ ప్రక్రియ

**గుజరాత్‌లో 68 లక్షల 12 వేల 711 ఓట్ల తొలగింపు**

**వరాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం**




**న్యూఢిల్లీ,**
ఆరు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయింది. ఆ వివరాలను ఎన్నికల కమిషన్ శనివారంనాడు విడుదల చేసింది. రివిజన్ పక్రియలో భాగంగా ఆయా రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో అనర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. తాజాగా విడుదల చేసిన జాబితాలో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కంటే గుజరాత్‌లో అత్యధికంగా ఓటర్ల తొలగింపు చోటుచేసుకుంది. రికార్డు స్థాయిలో 68 లక్షల 12 వేల 711 మందిని జాబితా నుంచి తొలగించింది. ఎస్ఐఆర్ పక్రియకు ముందు 5,08,43,436 మంది ఓటర్లు ఉండగా అది ప్రస్తుతం 4,40,30,725కు తగ్గింది. మధ్యప్రదేశ్‌లో 34,25,078 మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించింది. దీంతో ఓటర్ల సంఖ్య 5,74,06,143 నుంచి 5,39,81,065కు తగ్గింది. తర రాష్ట్రాల్లోన్రూ గణనీయంగా ఓటర్ల జాబితాలో సవరణలు చేటుచేసుకున్నాయి. రాజస్థాన్‌లో ఓటర్ల సంఖ్య 5,46,56,215 నుంచి 5,15,19,929 మందికి తగ్గింది. ఛత్తీస్‌గఢ్‌లో 2,12,30,737 నుంచి 1,87,30,914కు, కేరళలో 2,78,50,855 నుంచి 2,69,53,644కు తగ్గింది. గోవాలో ఓటర్ల సంఖ్య 11,85,034 నుంచి 10,57,566కు తగ్గింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ ఐలాండ్స్‌లో 52,364 మందిని జాబితా నుంచి తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 3,10,404 నుంచి 2,58,040కి తగ్గింది. పుదుచ్చేరిలో ఓటర్ల సంఖ్య 10,21,578 నుంచి 9,44,211 మందికి, లక్షద్వీప్‌లో 57,813 నుంచి 57,607కు తగ్గింది. ఓటర్ల మరణం, శాశ్వతంగా నివాసస్థలాల మార్పు, పలుచోట్ల రిజిస్టర్ చేయించుకోవడం, ఇతర అనర్హత కారణాల వల్ల ఓటర్ల తొలగింపు జరిగిందని, కొత్త ఓటర్లకు జాబితాలో చోటు కల్పించామని ఈసీ తెలిపింది. ఎన్నికల జాబితా అప్‌డేట్ అనేది నిరంతర పక్రియ అని, అర్హత కలిగిన పౌరులు అప్లయ్ చేసుకోవడం, ఎంట్రీల కరెక్షన్ వంటివి చేసుకోవచ్చని పేర్కొంది.

## అవినీతి నిరూపిస్తే వెంటనే రాజీనామా

మొదటి తరువాయి

గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు. 263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ కాలేజీ భూముల్లో ఒక్క ఇంచు తేడా వచ్చిన రాజీనామా చేస్తానన్నారు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. దొంగ ఎవరో దొర ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ఇన్ని రోజులు ప్రశాంతంగా ఉన్న కామారెడ్డిని రణరంగంగా మార్చారని ఫైర్ అయ్యారు. తనను చంపుతామని బెదిరించారని..ఇవాళ ఆ పనిచేశారని ఆరోపించారు. తాను పిలిస్తే వేలమంది రోడ్లమీదకు వచ్చేవాళ్లు.. అపుడు పరిస్థితి ఎలా ఉండేదని ప్రశ్నించారు వెంకటరమణా రెడ్డి. తాను తప్పు చేసినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పారు. రేపటి నుంచి గ్రామాల్లో తిరుగుతా. ఇక యుద్ధ వాతారణమేనని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హెచ్చరించారు. తనపై ఏం జరిగినా ప్రభుత్వానిది, సీఎందే బాధ్యత అనిచెప్పారు. ఇవాళ కారు బోల్తా పడింది రేపు మీ ప్రభుత్వం కూడా బోల్తా పడుతుందన్నారు. తమ కుటుంబంపై వచ్చిన ఆరోపణల విషయంలో తన నిజాయితీ నిరూపించుకునేదాక ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటి వరకు కామారెడ్డిలో ఏది జరిగిన భరించా ఇక నుంచి భరించే ప్రసక్తే లేదన్నారు.

## భారత్ టారిఫ్‌లు కట్టాల్సిందే..

మొదటి తరువాయి

సంతకాలు చేశారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా తన ట్రూత్ ఖాతా ద్వారా వెల్లడించారు.ప్రపంచ దేశాలపై సుంకాలకు సంబంధించి అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం ట్రంప్ తప్పుబట్టారు. అత్యంత ఆమోదయోగ్యమైన పద్ధతిలో మేం విధించిన టారిఫ్‌లను సుప్రీంకోర్టులో కొందరు వ్యతిరేకించారని.. న్యాయమూర్తులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇందుకు వారు సిగ్గుపడాలి అంటూ విరుచుకుపడ్డారు. ఇది చాలా హాస్య?స్పదకరమైన తీర్పు అని అన్నారు. ఇక టారిఫ్‌లకు సంబంధించిన సర్దుబాటు ప్రక్రియ మొదలైందని వెల్లడించారు. గతంలో తీసుకున్న దానికంటే ఎక్కువ వసూలు చేసేందుకు సాధ్యమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దేశ ఆదాయాన్ని పెంచేందుకు మరింత శక్తివంతమైన మార్గలెన్నో తమకు అందుబాటులో ఉన్నాయని.. ఇకపై మరిన్ని టారిఫ్‌లను విధించగలనని చెప్పారు. ఈ క్రమంలోనే 10 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.భారత్ -- అమెరికా వాణిజ్య ఒప్పందం పైనా ట్రంప్ స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం ఈ ట్రేడ్ డీల్‌పై ఉండదని .. ఒప్పందంలో ఎలాంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. భారత్ సుంకాలు చెల్లిస్తుందని తెలిపారు. మోదీ గొప్ప జెంటిల్‌మ్యాన్.. తన వ్యతిరేకుల కంటే కూడా చాలా తెలివైన వ్యక్తి. కానీ మనల్ని ఆయన మోసం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అందుకే ఈ వాణిజ్య ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. దీని ప్రకారం అమెరికాకు భారత్ టారిఫ్‌లు చెల్లిస్తుందని... కానీ ఇండియాకు అమెరికా చెల్లించదని తేల్చిచెప్పారు. కాగా, ఈ 10 శాతం టారిఫ్‌లను ఇండియా కూడా చెల్లించాల్సిందేనని వైట్ హౌస్ అధికారులు స్పష్టం చేశారు. 1977 నాటి IEEPA చట్టం ప్రకారం ట్రంప్ ఇప్పటిదాకా పలు దేశాలపై విధించిన టారిఫ్‌లు సుప్రీంకోర్టు తీర్పుతో రద్దయ్యాయని.. వాటి స్థానంలో ట్రంప్ తాజాగా విధించిన టారిఫ్‌లు అమలులోకి రానున్నాయి. 1974 నాటి వర్తక చట్టంలోని 122 సెక్షన్ ప్రకారం ట్రంప్ ఈ టారిఫ్‌లు విధించారు. ఈ నిర్ణయానికి 150 రోజుల్లోపు కాంగ్రెస్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. లేదంటే ఈ టారిఫ్‌లు కూడా 150 రోజుల తర్వాత రద్దవుతాయి.

## మలగం యల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు




**మిర్యాలగూడ, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ పట్టణంలోని బంగారిగడ్డ 31వ వార్డుకు చెందిన మలగం యల్లయ్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహా రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ, యల్లయ్య మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ధనావత్ చిట్టిబాబు నాయక్, కునాల గోపాల్ కృష్ణ, చాంద్ పాషా, నూనే రవి కుమార్, లింగంపల్లి చీరంజీవి, కంచర్ల దయాకర్ రెడ్డి, దోనేటి సైదులు, నల్లగంతుల నాగభూషణం, బక్కయ్య, నక్క రామకృష్ణ, బొడ్డు సైదులు, అన్నపర్తి గంగాధర్, మన్నెం లింగా రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆలయ పునరనిర్మాణానికి రాసాల వెంకటేష్ యాదవ్ విరాళం



**బోడుప్పల్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ సీతారామ ఆంజనేయస్వామి ఆలయ పునరనిర్మాణంలో భాగంగా 23వ డివిజన్ మాజీ కార్పొరేటర్ రాసాల వెంకటేష్ యాదవ్ తన కుమారుడు రసాల పృథ్వి యాదవ్‌తో కలిసి ఆలయ కమిటీకి రూ. 1,01,000 విరాళం అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, బాల్యం నుండి ఆంజనేయస్వామి భక్తుడిగా ప్రతి శనివారం స్వామి దర్శనం చేసుకుంటానని, ఆలయ పునరనిర్మాణంలో భాగస్వామ్యం కావడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆమనగల్లు ఎంఈఓ కు వినతి పత్రం అందజేత



**ఆమనగల్లు, ఫిబ్రవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లి పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని ఇతర పాఠశాల కు పంపడంపై మున్సిపాలిటీ నాలుగో వార్డు కౌన్సిలర్ దుడ్డు ఆంజనేయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం గ్రామ యువకులతో కలిసి ఎంఈఓ పాండుకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఆ డిప్యూటేషన్ను వెంటనే రద్దుచేసి, తిరిగి నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరమేష్ గౌడ్, అల్లాజీ, రవీందర్, శ్రీధర్, శివాజీ,అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డ్ ను తరలించాలి



**ఆమనగల్లు, ఫిబ్రవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు మున్సిపాలిటీ లోని శ్రీనివాస కాలనీలో ఉన్న మరోక ప్రదేశానికి మార్చాలని కోరుతూ ఆ ప్రాంత కౌన్సిలర్ పుల్లారెడ్డి అనూష ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శంకర్ కు వినతి పత్రం అందజేశారు. నివాస ప్రాంతంలో ఉన్నా డంపింగ్ యార్డు ఉండడం వల్ల, మురికి వాసనకు దోమలు,ఈగలు, పందులు మరియు చనిపోయిన కుక్కలు వేయడం వల్ల ఆ కాలనీ లో ని ప్రజలకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని,ప్రజల ఆరోగ్య దృష్ట్యా డంపింగ్ యార్డు ను మరోక ప్రదేశానికి తరలించాలని కమిషనర్ ను కోరడం జరిగింది. కార్యక్రమంలో పుల్లారెడ్డి శ్రీశైలం, కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వంగూరులో రెయిన్ బో పోటీలు



**వంగూరు, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో శనివారం మండల స్థాయి రెయిన్ బో పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ కమిషన్ సభ్యుడు కె.వి.ఎన్. రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూర్గుల యాదయ్య, ఉపసర్పంచ్ భాస్కర్, ఎంఈఓ మురళీమోహన్, ఎంపిటిఓ బ్రహ్మచారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వడ్త్య రమేష్ నాయక్



**దేవరకొండ ఫిబ్రవరి 21. (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా,గుండ్లపల్లి మండలం (డిండి) మండలం దాసరి నెమలి పూర్ లో కొలువైన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలసందర్భంగా స్వామి వారిని బిఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు కార్యక్రమం నిర్వహించారు.
అనంతరం కమిటీ సభ్యులు వడ్త్య రమేష్ నిశాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలోదాసరి నెమలి పూర్ సర్పంచ్ రఫియా- భాసీర్ , ఉప సర్పంచ్ రాంరెడ్డి,నరేందర్ రెడ్డి, భగవత్ ,శ్రీను,పెద్ద తండ మాజీ కాట్రావత్ వెంకటేష్, బాలాజీ నాయక్ ,ఫుల్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల అరెస్టు



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గాంధీభవన్ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమవుతున్న నాగర్‌కర్నూల్ బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా కోశాధికారి రాజా రామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు ఎలిమేరాము, దళిత మోర్చా అధ్యక్షుడు పెదబాబు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు రాము యాదవ్, సీనియర్ నాయకుడు లక్ష్మయ్యతో పాటు పలువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## రంగారెడ్డి జిల్లా కోర్టులో ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**రంగారెడ్డి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో బంజారాల ఆరాధ్యదైవం సద్గురు సంత్ శ్రీ శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. బంజారా లాయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్టీఐఎస్ఎస్ నేషనల్ ప్రెసిడెంట్ కె. బాబురామ్ నాయక్ అతిథిగా విచ్చేసి సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు ప్రసంగించి సభికులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాణి, డా. రతన్ సింగ్, డా. శ్రీనివాస్ నాయక్, అడ్వకేట్ రమేష్ చౌహాన్, బావోజీ పంతు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**అమ్రాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ పాల్గొని ఉత్సవ కమిటీ సన్మానం స్వీకరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మన్ననూర్ సర్పంచ్ మంజుల, ఉపాధ్యక్షుడు శంభో శోభతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ సమక్షంలో ఉచిత హెల్త్ క్యాంప్



**ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలో తిరుమలాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకొని మందులు అందించడం, పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భరిగెల శ్రీకాంత్, ఉప సర్పంచ్ రేనయ్య యాదవ్, డాక్టర్లు స్వప్న, అభిలాష్, సూపర్వైజర్ ప్రభావతి, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీను, రమేష్, జగదీష్ పాల్గొన్నారు. వృద్ధులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు కూడా హాజరయ్యారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ లక్ష్మినారాయణ రెడ్డి



**తుక్కుగూడ, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జీహెచ్ఎంసీ పరిధిలోని తుకుగూడా డివిజన్ పహాడీషెరీఫ్ పోలీస్ స్టేషన్‌కు కొత్తగా నియమితులైన సీఐ లక్ష్మినారాయణ రెడ్డిని భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బరిగెల రాజు గౌడ్, జాపాల సుధాకర్, భోద యాదగిరి రెడ్డి కలిసి సీఐను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తుకుగూడా డివిజన్‌లో శాంతి భద్రతలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తూ, పోలీస్ శాఖకు తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వారు పేర్కొన్నారు.

## గుండాల దేవాలయానికి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి విరాళం



**వెల్దండ, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల గుండాల గ్రామంలోని శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ఆలయానికి యెన్నం శ్రీకాంత్ రెడ్డి రూ. 50,000 విరాళం అందజేశారు. ఆలయ ఈవో ప్రసాద్‌కు విరాళాన్ని అందజేసి, పునరుద్ధరణలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమార్ శర్మ, సంతోష్ శర్మ, సురేష్ శర్మ, కృష్ణయ్య శర్మ, వీరేశం శర్మ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నకేశవ కాలనీ పాఠశాలలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



**ఆమనగల్లు, ఫిబ్రవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు మండలంలోని మంగళపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నకేశవ కాలనీ లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి పాండు , చెన్నకేశవ కాలనీ వార్డు సభ్యులు శిరీష పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కగా పాఠాలను బోధించారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించడంతో విద్యార్థులు వారి ఆనందాన్ని వారి తల్లిదండ్రులతోటి, వారి సహచర విద్యార్థులతో తమ సంతోషాలను పంచుకున్నారు. ఎంఈఓ గా శైలజ, ప్రధానోపాధ్యాయుడుగా వెంకటేష్, మిగతా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నిర్మల, సాయి, పాఠశాల ఉపాధ్యాయులు తలారి శ్రీను, ఏలె ఉమామహేశ్వరి, అంగన్ వాడీ టీచర్ అనిత ,పర్వతాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, అంగన్ వాడీ విద్యార్థులు, చెన్నకేశవ కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# హాల్ టికెట్లపై విద్యార్థులలో అయోమయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్న వేళ ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయి. ఫీజులు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామని యాజమాన్యాలు పట్టుబడుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.ఈ నెల 25న ఇంటర్ మొదటి సంవత్సరం, 26న రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. హాల్ టికెట్లు కాలేజీ లాగిన్‌లలో మాత్రమే ఓపెన్ అవుతుండటంతో ఫీజులకు ముడిపెడుతున్నారు. హాజరు శాతం తక్కువగా ఉందని అదనపు ఫీజులు వసూలు చేయడం, నో డ్యూ సర్టిఫికెట్ లేకుండా హాల్ టికెట్లు ఇవ్వకపోవడం విద్యార్థుల భవిష్యత్తును సంకటంలో పడేస్తోంది.ఇంటర్ బోర్డు అధికారులు హాల్ టికెట్లను ఫీజులతో సంబంధం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వెంకటగిరి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**ఆమనగల్లు, ఫిబ్రవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** ఆమనగల్లు పట్టణంలో వెలసిన స్వయంభు శ్రీ అలర్ మేల్ మంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల కరపత్రాలను శనివారం నాడు ఆలయ అర్చకులు శ్రీ గుఢా కృష్ణమాచార్య (కిట్టయ్య) దేవాలయ సన్నిధానంలో ఆవిష్కరించారు. ఐదు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాల కొరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, పచ్చటి తోరణాలతో, రకరకాల పూలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. సోమవారం నుండి శుక్రవారం వరకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సోమవారం అంకురార్పణము, మంగళవారం శ్రీవారి మహాభిషేకము, బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి తిరు కళ్యాణం, గురువారం ఉదయం 6 గం: రథోత్సవం, సాయంత్రం 7 గంటలకు దీపోస్తవం, శుక్రవారం సుదర్శన హావనం, పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు చక్రతీర్థం, మొదలగు కార్యక్రమంలో జరుగుతాయన్నారు. ప్రతిరోజు పూజలు, సుప్రభాత సేవతో ప్రారంభమవుతాయన్నారు. స్వామివారి కళ్యాణం జరిపిన రోజు దేవాలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతిరోజు దేవాలయ ఆవరణలో సంస్కృతిక కార్యక్రమాలు భజన బృందాలచే గాన కచేరీలు ఉంటాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కరుణాకటాక్షాలు పొందాలని ఆలయ అర్చకులు గూఢా కృష్ణమాచార్యులు పేర్కొన్నారు.

## కల్వకుర్తి సగర (ఉప్పర) సంఘం ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కు ఘన సన్మానం



**కల్వకుర్తి, ఫిబ్రవరి 21(నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలో నూతన మున్సిపల్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ను శనివారం రోజు కల్వకుర్తి సగర (ఉప్పర) సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు వారికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సగర సంఘం ప్రతినిధులు తమ సమాజానికి సంబంధించిన పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా స్మశాన వాటిక కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, అసంపూర్తిగా ఉన్న సగర సంఘం భవన నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. సంఘం సభ్యుల వినతులను శ్రద్ధగా ఆలకించిన చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ సానుకూలంగా స్పందించారు. సగరుల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని, సగరుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి సగర సంఘం నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నేత రామచంద్రం మృతి



**మానకొండూర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** సిపిఐ సీనియర్ నాయకుడు శ్రీరాముల రామచంద్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు.గత 40 సంవత్సరాలుగా పార్టీతో అనుబంధం కలిగిన రామచంద్రం గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి కార్మికుల సమస్యలపై ఉద్యమాలు నడిపారు. కొండపల్కల గ్రామంలో పార్టీ కార్యాలయం నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు.74 ఏళ్ల వయసులో కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని శ్రీనివాస్ పేర్కొన్నారు. గత సంవత్సరం జిల్లా మహాసభలో అమరవీరుల స్మారక స్థూపాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించే అవకాశం కలిగిందని గుర్తుచేశారు.కొత్తపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో ఆయన మృతి అత్యంత బాధాకరమని, పార్టీకి పెద్దదిక్కు కోల్పోయినట్లేనని, ఆయన కుటుంబానికి సిపిఐ జిల్లా సమితి తరఫున సంతాపం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

# రామగిరిలో దారుణ హత్య



**రామగిరి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీలో పాత కక్షలతో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం మధ్యాహ్నం సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న పెళ్లికి నారాయణపూర్‌కు చెందిన మొలుగూరి కొమురయ్య, ఆయన తమ్ముడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాత కక్షలతో సమీప బంధువు కత్తితో దాడి చేయగా, అడ్డుకునే ప్రయత్నంలో కొమురయ్యకు కత్తిపోటు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.

# ఈత చెట్లు ధ్వాస్వం చేసినవారిపై కట్టిన చర్యలు తీసుకోవాలి



**సిద్దిపేట, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్గల్ మండలంలోని మసీద్‌పల్లి గ్రామంలో గౌడ--ముదిరాజ్ వర్గాల మధ్య ఈతవనం భూమి వివాదం తీవ్రతరమైంది. గౌడ సంఘానికి చెందిన స్థలంలో నాటిన ఈత చెట్లను ముదిరాజ్ వర్గానికి చెందిన కొందరు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి.గ్రామస్తుల సమాచారం ప్రకారం, గతంలో ఎల్లమ్మ గుడి ట్రస్ట్ పేరిట భూమి రిజిస్ట్రేషన్ చేసి హరితహారం కార్యక్రమంలో భాగంగా ఈత మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇటీవల ఆ భూమి తమదేనంటూ ముదిరాజ్ వర్గం అభ్యంతరం వ్యక్తం చేసి చెట్లు తొలగించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు గ్రామానికి చేరుకుని చెట్లు తొలగించిన వారిని గజ్వేల్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు. తొగుట సీఐ లతీఫ్ సిబ్బందితో కలిసి ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు.గౌడ సంఘం సభ్యులు తమ జీవనాధారమైన ఈత చెట్లను ధ్వంసం చేయడం తీరని నష్టమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివరాం గౌడ్, నాయకులు జయ వెంకటస్వామి, నరేష్ గౌడ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టాస్క్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## - కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి రీజినల్ టాస్క్ సెంటర్‌ను నిరుద్యోగ యువత తప్పక వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు.ఆర్టీసీ బస్ డిపో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న టాస్క్ సెంటర్‌లో ఉచితంగా పలు టెక్నికల్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. జావా వెబ్ డెవలప్‌మెంట్, పైథాన్, సీ, సీ౦ం, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, జావాస్క్రిప్ట్, టాలీ విత్ జీఎస్టీ, మెడికల్ కోడింగ్ ఢ బిల్లింగ్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇప్పటికే శిక్షణ పొందిన వారికి మంచి జీతాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఫిబ్రవరి 28లోపు టాస్క్ సెంటర్‌లో పేరు నమోదు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 90595 06807 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## ప్రమాదవశత్తు గడ్డివాము దగ్ధం



**ఆమనగల్లు, ఫిబ్రవరి (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మండలం చింతలపల్లికి చెందిన రైతు కొప్పు లక్ష్మయ్య కు చెందిన గడ్డివాము శనివారం ఉదయం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని పూర్తిగా కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. కాలిపోయిన గడ్డివాము విలువ రూ.30 వేలు ఉంటుందని చెప్పారు. ఉదయం పాలు తీసుకుని వచ్చి, తిరిగి పొలం వద్ద వెళ్లి చూడగా పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డివాము పూర్తిగా బూడిదైనట్లు వివరించారు. తనను ఆదుకోవాలని బాధితుడు అధికారులకు విజ్ఞప్తి చేశాడు.

## మాతృభాషపై మమకారం పెంచుకోవాలి



**వనపర్తి ఫిబ్రవరి 21( నీలగిరి ఎక్స ప్రెస్ ):**
ప్రతి ఒక్కరూ మాతృ భాషపై మమకారం పెంచుకోవాలనీ సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కళావేదిక పక్షాన తెలుగు భాషకు సేవలందించిన పలువురు సాహితీవేత్తలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఇతర భాషలపై వ్యామోహంతో ఉపాధి అవకాశాల కోసం పరాయి భాషలను ప్రోత్సహిస్తే మాతృ భాషల మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని అభిప్రాయ పడ్డారు. తల్లిదండ్రులు బాల్యం నుంచే తమ పిల్లలకు తమ మాతృ భాషపై ఆసక్తిని గౌరవాన్ని పెంపొందించాలని శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు సందాపురం బిచ్చయ్య,కందూరు నారాయణ రెడ్డి, జనజ్వాల,కొత్తకాపు నారాయణ రెడ్డి,మందాపురం సుజాతమ్మ,యం. ఏ . సత్తార్,తదితరులను శాలువాలతో సత్కరించారు. ఈనాటి కార్యక్రమంలో వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్,బెల్లంపల్లి శ్రీనివాసులు,గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్,బుచ్చిబాబు, కృష్ణ,ఖాజా, జి రామకృష్ణారెడ్డి, పావనం చంద్ర శేఖర్, కృష్ణా రెడ్డి మున్నగువారు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ స్కూల్ తనిఖీ చేసిన ఎంఈవో

-మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్య నాయక్.






**దేవరకొండ ఫిబ్రవరి 21. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో ని పిఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల మరియు కళాశాల ను మండల విద్యాధికారి ఇస్లావత్ గోప్య నాయక్ మరియు బృందం జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ శేఖర్ ఉత్తర్వుల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఇందులో భాగంగా పిఎం శ్రీ లోగో , మంచినీటి వసతి, పరిసరాలశుభ్రత , తరగతి గదుల శుభ్రత,బాలుర, బాలిక ల టాయిలెట్ల పరిశుభ్రత,తదితర అంశాలపై పర్యావేక్షణ చేశారు.అనంతరం ఉపాధ్యాయుల దినచర్య,భోధనోపకరణలు, పాఠ్య ప్రణాళికల తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెడ్ మాస్టర్ గీతాంజలి, రాంబాబు,పల్లా వెంకటయ్య,వేముల తిరుపతయ్య, చింత బిచ్చయ్య,రమా, శ్రీలత, కోదండ రామారావు, వేంకటేశ్వర్లు, ఎన్ ఎన్ విజయ్ కుమార్, ఇమ్మడి చెన్నయ్య, సోమయ్య, రాజు, రమేష్, శ్రీను శ్రీలత , రుంషా,వి.విజయ్, ధనలక్ష్మి, సందీప్, యాదగిరి ,ఏ రవి,తదితరులు పాల్గొన్నారు.

# నాపై రేపిస్టులు, కల్తీకల్లు వ్యాపారులు కూడా దాడి చేస్తారా?

-వనపర్తి కాంగ్రెస్‌లో బహిరంగ ఆరోపణలు చేసిన చందర్



**వనపర్తి ఫిబ్రవరి 21( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి పట్టణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు బహిరంగరంగంలోకి వచ్చాయి. శనివారం 3వ వార్డులో నిర్వహించిన పత్రికా సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీర్ల చందర్ పలువురు పార్టీ నాయకులపై తీవ్ర ఆరోపణలు చేశారు.తనపై అనవసర ఆరోపణలు చేస్తున్న వారిపై స్పందిస్తూ, "నాపై రేపిస్టులు, కల్తీకల్లు వ్యాపారులు కూడా దాడి చేస్తారా?" అంటూ ప్రశ్నించారు. పార్టీ పేరును అడ్డంగా పెట్టుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేస్తున్న వారిని ప్రజలు గుర్తించాలని అన్నారు.మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ బీజేపీతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. అలాగే బి.కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మధు గౌడ్ తదితరులపై కూడా విమర్శలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీకి పూర్తి మద్దతు ఇవ్వకుండా, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. తనపై వ్యక్తిగత దాడులు కొనసాగితే మౌనం వహించబోనని, అవసరమైతే పాత విషయాలన్నీ బహిర్గతం చేస్తానని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, పార్టీ లోపలే తనను రాజకీయంగా దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ పరిణామాలు వనపర్తి కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి. నాయకుల మధ్య పెరుగుతున్న విభేదాలు భవిష్యత్తులో పార్టీపై ప్రభావం చూపే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెంచాలని కలెక్టర్ ఆదేశం





**మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం అమలుపై శనివారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరానికి లేబర్ బడ్జెట్ లక్ష్య సాధనలో వెనుకబడిన మండలాలు వారం రోజుల్లో ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీ కార్యదర్శి కూలీల సమీకరణ బాధ్యత తీసుకోవాలని సూచించారు.అలాగే నర్సరీల్లో 100% బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాల డిబ్లింగ్ జరగాలని, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ చేపట్టిన పనులు వెంటనే ప్రారంభించి పూర్తయిన పనులను ఆన్లైన్‌లో చూపించాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మధుసూదన్ రాజు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, ఇంజనీర్లు, మండల ప్రోగ్రాం అధికారులు, అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు భాష గొప్పతనం ప్రపంచానికి చాటి చెప్పాలి



**మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నూకల రామచంద్రరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. తెలుగు, హిందీ, ఆంగ్ల విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి. లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ అమ్మ ఒడిలో పలికే తొలి పలుకులే మాతృభాష అని, ప్రతి ఒక్కరూ తమ భాష గొప్పతనం తెలుసుకొని గౌరవించాలని సూచించారు.హిందీ విభాగాధ్యక్షురాలు అన్నపూర్ణ 1952లో ఢాకా విశ్వవిద్యాలయంలో మాతృభాష పరిరక్షణ కోసం విద్యార్థులు చేసిన త్యాగాన్ని గుర్తుచేశారు. తెలుగు అధ్యాపకుడు డా. ఉపేందర్ భాషల అంతరించిపోతున్న పరిస్థితిని ప్రస్తావిస్తూ, మాతృభాషలో మాట్లాడటం వల్ల భాషను కాపాడుకోవచ్చని అన్నారు. ఆంగ్ల అధ్యాపకురాలు డా. సుమలత ఉద్యోగ అవకాశాల కోసం ఆంగ్లం నేర్చుకున్నప్పటికీ, మన అస్తిత్వం మాతృభాషలోనే ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతిబింబించే కవితలు, గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ జె. అనిల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల మనుగడకు పాటుపడాలి

-- సర్పంచ్ సిద్ధి తిరుపతి



**ఎలిగేడు, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించి వాటి మనుగడకు తల్లిదండ్రులు పాటుపడాలని రాములపల్లి సర్పంచ్ సిద్ధి తిరుపతి యాదవ్ పిలుపునిచ్చారు.రాములపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తానని, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి యాదవ్, ఉపసర్పంచ్ తీట్ల విద్యాలతను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బోదకాలు వ్యాధిపై అవగాహన



**మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కేంద్రంలోని స్థానిక యుపిఎస్‌ను సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం పర్యవేక్షించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బోదకాలు ఉన్నవారు తప్పనిసరిగా డాక్టర్ను సంప్రదించి మందులు వాడాలని సూచించారు. కాలు వాపు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేయడం వ్యాధిని పెంచుతుందని హెచ్చరించారు. ఈ రోజు ఇద్దరు బోదకాలు బాధితులను గుర్తించి వైద్య పరీక్షలు చేయించి మందులు వాడేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.బోదకాలు వ్యాధి లక్షణాలు పెరిగినప్పుడు క్యూలెక్స్ దోమ కుట్టి మరొకరికి వ్యాధి సోకే ప్రమాదం ఉందని, కాబట్టి వాపు తగ్గకపోతే వెంటనే డాక్టర్ను సంప్రదించి డీఈసీ టాబ్లెట్ వాడాలని సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### సైన్స్ ఎక్స్పోలో గీతాంజలి హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**పెద్దపల్లి,ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన టెక్నో స్పార్క్ 2కె26 జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియంలో గీతాంజలి హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ డస్ట్ బిన్ ప్రాజెక్ట్‌కు మూడవ బహుమతి లభించింది. ఈ విజయంపై కరెస్పాండెంట్ రేపాల రజిత, అకాడమిక్ డైరెక్టర్ రేపాల రోహిత్ విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ఘనంగా మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



**పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లాలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆమె నివాసంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్న ఈ జాబ్ మేళా ద్వారా టెన్త్ క్లాస్ నుండి పీజీ వరకు అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.ఈ సందర్భంగా కవితక్క మాట్లాడుతూ యువత ఉపాధి, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రతే తమ లక్ష్యమని, ప్రతి యువకుడు ఉద్యోగం పొందే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జాగృతి ప్రధాన కార్యదర్శి నవీనాచారి, మధు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్లు చందర్, శైలేష్, ప్రభు, సత్యం, జాగృతి నాయకులు మహేష్, సాగర్, మల్లేష్, రాజు, సంజు, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం సమక్షంలో పురపాలక చైర్మన్‌కు ఘన సన్మానం



**పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన నూగిళ్ల మల్లయ్యను విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.జిల్లా అధ్యక్షుడు భీమోజు సురేందర్ చారి నాయకత్వంలో చైర్మన్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సురేందర్ చారి మాట్లాడుతూ సామాన్య కార్యకర్త స్థాయి నుండి మున్సిపల్ చైర్మన్‌గా ఎదిగిన మల్లయ్య నాయకత్వంలో పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగులమల్యాల ప్రసాద్, జిల్లా కార్యదర్శి గర్రెపల్లి రాజు, ఉపాధ్యక్షుడు చేల్లోజు సుదర్శన్, బీసీ సంఘం నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్‌తో పాటు అలువోజు మునేందర్, బి.హరీష్, బి.బాస్కర్, నూతి రవేందర్ మరియు ఇతర విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైంది - శాంతి కుమార్



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ మేయర్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామమని, ఇకపై కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతి కుమార్ అన్నారు. శనివారం సాయి మహాలక్ష్మి గార్డెన్స్‌లో జరిగిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 కరీంనగర్ జిల్లా కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలన పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, భవిష్యత్తు అంతా బీజేపీదేనని పేర్కొన్నారు. ఉచితాలు, హామీలు, ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని, రెండున్నర ఏళ్లలో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి కేవలం అధికారాన్ని కాపాడుకోవడంలో నిమగ్నమై ఉన్నారని అన్నారు.వచ్చే నెలలో జరగబోయే శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వ్యక్తి నిర్మాణం ద్వారా సంస్థ నిర్మాణం, సంస్థ నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం అనే పార్టీ సిద్ధాంతాన్ని గుర్తు చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మహిళా నాయకురాలు నిర్మలారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, ఉపాధ్యక్షుడు సాయిని మల్లేశం, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకువచ్చిన సర్దార్ రవీందర్ సింగ్



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మున్సిపల్ ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని కార్యరూపంలోకి తీసుకువచ్చి మరోసారి మాట నిలబెట్టుకున్న నాయకుడిగా సర్దార్ రవీందర్ సింగ్ నిలిచారు.58వ డివిజన్ కార్పొరేటర్, మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అయిన ఆయన, మాడిశెట్టి రవీందర్--నిర్మల దంపతుల కుమార్తె అక్షిత వివాహ మహోత్సవానికి హాజరై, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.25,000 నగదును కట్నం కింద అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద బలం అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి మాటను బాధ్యతగా భావిస్తానని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచి సహాయం చేయడం ప్రజాప్రతినిధిగా తన కర్తవ్యమని స్పష్టం చేశారు.స్థానికులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మరచిపోకుండా అమలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. వివాహ వేడుకలో పాల్గొన్న ప్రజలు, నాయకులు ఆయన సేవా తత్పరతను ప్రశంసించారు.

## జీతాలు లేక పస్తులుంటున్న ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగులు

-- సమస్యను మండలిలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్సీ రవీందర్ రావు హామీ



**మహబూబాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లా ఎన్‌హెచ్‌ఎమ్ జెఏసి కమిటీ సభ్యులు శనివారం ఎమ్మెల్సీ రవీందర్ రావును మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు.గత ఎనిమిది నెలలుగా జీతాలు సరైన సమయానికి అందకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. రెగ్యులరైజేషన్ తమ ప్రధాన ఎజెండా అని, ఈ సమస్యను శాసన మండలిలో ప్రస్తావించి తగిన న్యాయం చేయాలని జిల్లా అధ్యక్షుడు డా. కుమార్ విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు ఉద్యోగుల సమస్యలను మండలిలో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 22న బాలాజీ గార్డెన్, మహబూబాబాద్‌లో జరగబోయే ఎన్‌హెచ్‌ఎమ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరవాలని కోరారు.

## ఆర్డీసీ ఎంపికైన అభిరామ్‌కు వైశ్య సేవా కేంద్రం ఘన సన్మానం



**కరీంనగర్ (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రిపబ్లిక్ డే క్యాంప్కు ఎంపికైన అక్కినపెల్లి అభిరామ్‌ను వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే అభిరామ్ దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర శ్రమకు నిదర్శనమని, రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమక్షంలో రిపబ్లిక్ వేడుకల్లో పాల్గొనడం జిల్లాకే కాక రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పెద్ది విద్యాసాగర్, కొండ రాంబాబు, నార్ల శ్రీనివాస్, రామిడి శ్రీధర్, కైలాస నవీన్, నలుమాచు చంద్రశేఖర్, బొల్లం శ్రీనివాస్, బొడ్ల శ్రీరాములు తో పాటు అభిరామ్ తల్లిదండ్రులు అక్కినపెల్లి నాగరాజు, శివజ్యోతి పాల్గొన్నారు.

## రాజ్యసభ సీట్లలో బీసీలకు అవకాశం ఇవ్వాలని డిమాండ్

**పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి తెలంగాణలో భర్తీ చేయనున్న రాజ్యసభ సీట్లలో ఒకటి బీసీలకు కేటాయించాలని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్ డిమాండ్ చేశారు.రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన వర్గాలకు సరైన న్యాయం చేయాలని, కాంగ్రెస్ పార్టీకి ఎల్లప్పుడూ చేదోడువాదుడుగా నిలిచిన బీసీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీజీ ఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు సీటు కేటాయించాలని ఏఐసీసీ పెద్దలను అభ్యర్థించారు.తెలంగాణ నుంచి భర్తీ చేసే రెండు రాజ్యసభ సీట్లను తెలంగాణ వారికే కేటాయించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు.

## ఎమ్మెల్యే విజయరమణ రావు కృషి ఫలించి పత్తి రైతులకు ఉపశమనం

**పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు కృషి ఫలించి పత్తి రైతులకు ఉపశమనం లభించింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 20తో పత్తి కొనుగోలు ప్రక్రియ ముగుస్తుందని ప్రకటించగా, రైతులకు నష్టం కలగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే విజయరమణ రావు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడారు. వెంటనే స్పందించిన మంత్రి, సిసిఐ అధికారులతో చర్చించి కొనుగోలు గడువును మరొక వారం రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకున్నారు.దీంతో పత్తి కొనుగోలు ప్రక్రియ ఫిబ్రవరి 27 వరకు కొనసాగనుంది. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించినందుకు ఎమ్మెల్యే విజయరమణ రావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

# యూరియా వాడకంపై రైతులు అపోహలు వీడాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ




**మానకొండూర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

యూరియా వాడకంపై రైతులు అపోహలు వీడి అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 90 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను అధికంగా వాడితే అధిక దిగుబడి వస్తుందనే అపోహ రైతుల్లో ఉందని, వాస్తవానికి ఇది తప్పు అని స్పష్టం చేశారు. అధిక యూరియా వాడకం వల్ల పంట నాణ్యత తగ్గడమే కాకుండా ప్రజారోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రైతులను చైతన్యపరచడం, ప్రత్యామ్నాయ సేంద్రీయ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించడం అవసరమని అన్నారు. యూరియా సమస్య దేశవ్యాప్తమైందని, బీఆర్ఎస్ శ్రేణులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని, గత పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పొందలేని నిరుపేదలు ఇప్పుడు ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా సొంతింట కలను సాకారం చేసుకుంటున్నారని తెలిపారు. మానకొండూర్ మండలంలో తొలి విడతగా 850 ఇండ్లు మంజూరు కాగా, 90 శాతం నిర్మాణాలు పూర్తయ్యాయని, త్వరలో గృహప్రవేశాలు జరగనున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, తహసీల్దార్ నరేందర్, ఎంపీవో సతీష్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ ఆర్. తిరుమల్ రెడ్డి, పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులను వేధిస్తున్న జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు కలిగిస్తున్న కొన్ని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని యుఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి సంద గణేష్ డిమాండ్ చేశారు. ఈ నెలలో జరగబోయే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు పూర్తి ఫీజు చెల్లించినప్పుడే ఇస్తామని కొన్ని కళాశాలలు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయని ఆయన ఆరోపించారు. తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, ముందుగా తగ్గిస్తామని చెప్పి చివర్లో తగ్గించకుండా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి జూనియర్ కళాశాల వద్ద హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాల్ టికెట్లు అందించాలని డీఐఈఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. హాల్ టికెట్లు ఇవ్వకపోతే కళాశాలల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేయడంలో యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అభిలాష్, ఉమామహేశ్వర్, సాయి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదవ రోజుకు చేరిన ఏసియన్ పెయింట్ డ్రైవర్ల సమ్మె



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: ఏసియన్ పెయింట్ గోదాం డ్రైవర్ల సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు కరీంనగర్ పట్టణ లారీ డ్రైవర్ల యూనియన్ పూర్తి మద్దతు ప్రకటించింది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ, డ్రైవర్లకు అగ్రిమెంట్ లేకుండా యాజమాన్యం లాభాలు దండుకుంటోందని విమర్శించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సీఐటీయూ అండగా ఉంటుందని, అవసరమైతే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్ మాట్లాడుతూ, గోదాములో పనిచేస్తున్న 60 మంది డ్రైవర్ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, లోడింగ్--అన్‌లోడింగ్ చార్జీలు చెల్లించకపోవడం, ఇన్సూరెన్స్ లేకపోవడం వల్ల ప్రమాదం జరిగితే కుటుంబాలు రోడ్డు పాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లకు కనీసం ఐదు లక్షల ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కీసర మల్లేశం, కోశాధికారి ఉత్తమల్ల వెంకటేశ్, ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, పట్టణ అధ్యక్షుడు ఎం.డి. ఆరిఫ్ మొయినొద్దిన్, ప్రధాన కార్యదర్శి ఎలుకపెల్లి రమేష్, కోశాధికారి సముద్రాల రాజకుమార్, ఉపాధ్యక్షుడు షకీల్ అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయంపై అవగాహన సదస్సు




**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనకు మహేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగం, ధనిక--పేద, మతం లేదా ఇతర విభజనలతో సంబంధం లేకుండా అందరికీ సామాజిక న్యాయం అందేలా చట్టాలు రూపొందించబడ్డాయని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులని, న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయ సహాయం అందించేందుకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎటువంటి సమస్య వచ్చినా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 15100 ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్‌తో పాటు షీ టీమ్ పోలీస్ కానిస్టేబుల్స్ స్వప్న, అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శిక్షణా సదస్సు



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఒకరోజు ఓరియంటేషన్ మరియు శిక్షణా కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీల సంరక్షణ, ప్రమాదకర కేసుల గుర్తింపు, డెలివరీల నిర్వహణ, ప్రసవానంతర సంరక్షణ, నవజాత శిశువుల తక్షణ సంరక్షణ, పుట్టినప్పటి నుండి 28 రోజుల వరకు శిశువులకు అవసరమైన వైద్య సహాయం, రిఫెరల్ ప్రోటోకాల్ వంటి అంశాలపై నిపుణులు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిజిహెచ్ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నిర్మల, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సతీష్, డాక్టర్ సంధ్య, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియా పాల్గొన్నారు.

## వైశ్యభవన్లో భూపతి కృష్ణమూర్తి శతజయంతి ఉత్సవాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

:ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నిస్వార్థంగా పోరాడిన నాయకుడు తెలంగాణ గాంధీ స్వర్గీయ భూపతి కృష్ణమూర్తి శతజయంతి ఉత్సవాలు స్థానిక వైశ్యభవన్‌లో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, కృష్ణమూర్తి గాంధేయవాదిగా జీవితాన్ని గడిపి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, ఆయన ఆశయాలు భావితరాలకు ఆదర్శప్రాయమని అన్నారు. గతంలో డాక్టర్ బోయినపల్లి వెంకట రామారావు సూచనతో ఆయన జీవిత చరిత్రను డాక్యుమెంటరీగా రూపొందించిన జ్ఞాపకాన్ని గుర్తుచేశారు. డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు మాట్లాడుతూ, అలాంటి మహానుభావుల జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాలలో ఉంటే భవిష్యత్ తరాలకు ఆయన గొప్పదనం తెలుస్తుందని అన్నారు. నిర్వాహకులు ఉప్పల రామేశం కరీంనగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, వరంగల్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బండ సత్తయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన పలువురు కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోయినపల్లి హన్మంతరావు, సబ్బని లక్ష్మీనారాయణ, కన్న కృష్ణ, చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం కృష్ణమూర్తి, గంజి స్వరాజ్ బాబు తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా మాడిశెట్టి గోపాల్ వ్యవహరించారు.

## రాజరాజేశ్వరి లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు




**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

లైన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ రాజరాజేశ్వరి క్లబ్ సర్వసభ్య సమావేశం నరహరి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత ఏడు నెలలుగా క్లబ్ నిర్వహించిన సేవా కార్యక్రమాలను కార్యదర్శి కిషన్ రెడ్డి సభ్యులకు వివరించారు. అనంతరం 2026--27 లైన్స్టిక్ ఇయర్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండ కిషన్ రెడ్డి, మొదటి ఉపాధ్యక్షుడిగా కె. తిరుపతి, రెండవ ఉపాధ్యక్షుడిగా కర్ర విద్యాసాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల బాలకిషన్ రావు, సహాయ కార్యదర్శిగా ఠాకూర్ వందన సింగ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యవర్గాన్ని సీనియర్ లయన్ ఆర్.ఎస్.పీ. రెడ్డి ప్రకటించారు. 2026--27 లైన్స్టిక్ సంవత్సరానికి క్లబ్ నుండి ఆర్.ఎస్.పీ. రెడ్డి ని రీజనల్ చైర్‌పర్సన్‌గా నియమించిన గవర్నర్ బద్రేశం కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కురుమ సంఘం సమక్షంలో 48వ డివిజన్ కార్పొరేటర్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ నగరపాలక సంస్థ 48వ డివిజన్‌కు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ కర్రె పద్మ అనిల్ కుమార్‌ను జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు కడారి అయిలన్న కురుమ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో సంఘం నాయకులు పూల బొకే, పూలదండలు, కురుమ రుమాలు, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీర్ల బీరయ్య కురుమ, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె రాజు కురుమ, జిల్లా ఉపాధ్యక్షుడు ఏగుర్ల అశోక్ కురుమ, ట్రస్ట్ అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్ కురుమ, నగర అధ్యక్షుడు కర్రె శ్రీనివాస్ కురుమ, ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఈరల్ల విజయ్ కుమార్ కురుమ, అమరగొండ సురేష్ కురుమ, దయ్యాల శ్రీనివాస్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ గాంధీ భూపతి కృష్ణమూర్తి గుప్త శతజయంతి వేడుకలు





**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి--మలిదశ తెలంగాణ ఉద్యమ నేత, తెలంగాణ ప్రజాసమితి అధ్యక్షుడు తెలంగాణ గాంధీ శ్రీ భూపతి కృష్ణమూర్తి గుప్త శతజయంతి వేడుకలు వైశ్యభవన్ ఏసీ హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గౌరీశంకర్ కాంప్లెక్స్ వాసవి ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం కన్వీనర్/డైరెక్టర్ రాచమల్ల భద్రయ్యను కరీంనగర్ మున్సిపల్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కన్న కృష్ణ, దేవాలయం చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్, భరోసా అధ్యక్షుడు అక్కినపెల్లి నాగరాజు, రైన్ స్టార్ట్ డాన్స్ అకాడమీ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్, జిల్లా మహాసభ కోశాధికారి పడకంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డిఐఈటి ప్రతిభా కేంద్ర పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కరీంనగర్ ఎల్‌ఎమ్‌డీ కాలనీలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డిఐఈటి)ను ప్రతిభా కేంద్రంగా ఉన్నతీకరించేందుకు 13.39 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చే గొప్ప వృత్తి అని, నాణ్యమైన విద్య లేకపోతే సమాజానికి నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఆంగ్లంలో ప్రావీణ్యం సాధించి ఆత్మవిశ్వాసం గల ఉపాధ్యాయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ ప్రిన్సిపల్ శ్రీరాం మొండయ్య, మహాత్మా నగర్ సర్పంచ్ పొన్నాల సంపత్, తిమ్మాపూర్ మండల అభివృద్ధి అధికారి మల్హోత్ర, టీజ?విడీసీ డివై.ఈ.ఈ. కృష్ణకుమార్, ఏ.ఈ. మక్దుమ్, కాంట్రాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహా ఆవిష్కరణ



**గంగాధర, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** :కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహా ఆవిష్కరణ నేడు జరగనుంది.స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, రజక సంఘాల నాయకులు హాజరుకానున్నారు.

## మహనీయుల విగ్రహాల ఏర్పాటు చెయ్యాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపల్ పట్టణంలో దేశ ప్రజల కోసం జీవితాలను త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలను జాతీయ రహదారి డివైడర్లపై ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు హుస్నాబాద్ మున్సిపల్ మేనేజర్ సంపత్ రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రజాకార్లను గడగడలాడించిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, సర్వాయ్ పాపన్న, జ్యోతిరావు--సావిత్రిబాయి పూలే, బాబు జగ్జీవన్ రావుతో పాటు హుస్నాబాద్ ప్రాంతంలో పేదలకు సేవలందించిన మాజీ శాసన సభ్యులు దివంగత బొప్పరాజు లక్ష్మికాంతారావు, దేశిని చిన్న మల్లయ్య విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, పట్టణ యూత్ అధ్యక్షుడు మేకల వికాస్ యాదవ్, అరవింద్ గౌడ్, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యుల సహకారమే గ్రామాలకు శ్రీరామ రక్ష - ఎంపీడీవో శశికళ





**పాలకుర్తి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పాలకుర్తి మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఐదు రోజులపాటు నిర్వహించిన జనరల్ ఓరియెంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం శనివారం ముగిసిందని ఎంపీడీవో శశికళ తెలిపారు.ఈ శిక్షణలో 16 గ్రామ పంచాయతీలకు చెందిన 155 మంది వార్డు సభ్యులకు గ్రామ పరిపాలన సౌలభ్యం, బాధ్యతలపై అవగాహన కల్పించారు. పంచాయతీ రాజ్ చట్టంలోని నియమ నిబంధనలకు లోబడి ఎలాంటి అవినీతికి పాల్పడకుండా అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల సహకారమే శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు.వార్డు సభ్యులు గ్రామ సమస్యలపై పోరాడి అధికారులను సంప్రదించి పనులు సజావుగా, సామరస్యపూర్వకంగా జరిగేలా కృషి చేయాలని సూచించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి వార్డు సభ్యునికి ధృవీకరణ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్. రాఘవులు, ఎస్.బి.ఎం జిల్లా కోఆర్డినేటర్ ఆర్. అలేఖ్య, పంచాయతీ అధికారి యు. సుదర్శన్, కార్యదర్శులు కోడిజుట్టు సుభాష్, సందీప్, వెంకటేశం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ డైరెక్టర్ నివాసాల్లో ఏసీబీ మెరుపు సోదాలు



**కల్వకుర్తి, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సుందరి కిరణ్ కుమార్‌పై ఆదానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ అధికారులు శనివారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏకకాలంలో 7 చోట్ల మెరుపుదాడులు జరిగాయి. సూర్యాపేట నుంచి హైదరాబాద్ వరకు, రైస్ మిల్లులు, బంధువుల ఇళ్లు, కార్యాలయాలు సహా పలు ప్రదేశాల్లో తనిఖీలు చేసి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.కిరణ్ కుమార్ గతంలో సూర్యాపేట డీఆర్డీఏగా పనిచేసిన సమయంలో ఆదానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఫిర్యాదులపై సుమోటో కేసు నమోదు చేసి సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. కల్వకుర్తి ఏడీఏ కార్యాలయం, సూర్యాపేట పొనుగోడు సొంత ఇల్లు, గరిడేపల్లి అత్తగారిల్లు, నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ఆవని రైస్ మిల్లులోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి.

## ఏకలవ్య స్కూల్ గుండాలలో నేడు గురుకుల ప్రవేశ పరీక్ష



**వెల్దండ, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల గుండాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ -2026 కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.ప్రిన్సిపల్ సుమన్ కుమార్ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్ష ప్రారంభమైన 10 నిమిషాల తర్వాత వచ్చే వారికి అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు.5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఈ పరీక్షకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారని అధికారులు తెలిపారు.

## సైన్స్ టాలెంట్ టెస్ట్తో విద్యార్థుల ప్రతిభ కనబర్చాలి



**మానకొండూర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మానకొండూర్ మండలంలోని ఎమ్మార్సీ వద్ద సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి మధుసూదనా చారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత పౌరులుగా ఎదగాలని, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. మండలంలోని తొమ్మిది పాఠశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనగా, అత్యధిక మార్కులు సాధించిన జెడ్‌పి హెచ్ఎస్ అన్నారం విద్యార్థిని మాతంగి అభిజ్ఞ, జెడ్‌పి హెచ్ఎస్ ఉటూరు విద్యార్థి ఇ. శివ సాయితేజ, టీజీ ఎంఎస్ పోచంపల్లి విద్యార్థి అబ్దుల్ రహమాన్‌ను జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో ఫోరమ్ బాధ్యులు నాగుల భుజన్ చందర్, గుండా శ్రీనివాస్, నాగుల రాజేష్ కుమార్, నలుమాచు చంద్రశేఖర్, గైడ్ టీచర్లు ఎండీ. మునీరొద్దిన్, దేవలక్ష్మి, సంధ్య, సురేఖ, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి





**తిమ్మాపూర్, ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:తిమ్మాపూర్ మండలం కొట్టపెల్లి గ్రామ శివారులో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌పై వెళుతున్న ఇద్దరిని వెనకనుండి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు.మరణించిన వ్యక్తి శ్రీరాములు గ్రామానికి చెందిన కొండపలకల, గాయపడిన వ్యక్తి బొమ్మనపెల్లి వాసిగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మనవి వైవిధ్యభరితమైన దేశాలు

- భారత్ పర్యటనలో బ్రెజిల్ అధ్యక్షులు లూలా
-- ప్రధాని మోడీతో భేటీ
-పలు కీలక అంశాలపై ఒప్పందం



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 21 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
భారత్, బ్రెజిల్ రెండు దేశాలు అతిపెద్ద ప్రజాస్వామిక దేశాలు మాత్రమే గాక ఎంతో వైవిధ్యభరితమైన దేశాలన్నీ, ఇరు దేశాలు సాంస్కృతిక పరిశ్రమకు కేంద్రాలు అని బ్రెజిల్ అధ్యక్షులు లూలా ద సిల్వా అభివర్ణించారు. భారత్‌లో ఆరోసారి పర్యటనకు శనివారం నాడు ఢిల్లీ చేరుకున్న అనంతరం హైదరాబాద్‌హౌస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సమావేశమయ్యారు. వీరిద్దరూ ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించుకుని.. మూడు ఎంఓఇలు కుదుర్చుకుని సంయుక్తంగా ప్రకటన చేశారు. ఇప్పటికే ఐదు రంగాల్లో ద్వైపాక్షిక సహకార అజెండాను పునర్నిర్మించుకున్నామని, తాజాగా ఇరు దేశాల భాగస్వామ్యానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఐటి, ఎఐ, బయోటెక్నాలజీ, అంతరిక్ష ప్రయోగాలు వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ఎంతో పురోగతి సాధిస్తోందని, ఇవి బ్రెజిల్‌కు ఎన్నో అవకాశాలు కల్పిస్తాయని లూలా ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు కోసం డిజిటల్ భాగస్వామ్యంపైన, అరుదైన భూమి, ఖనిజాలు, ఉక్కు సరఫరా గొలుసులో మైనింగ్ రంగంలో సహకారం కోసం మూడు ఎంఓయులు కుదుర్చుకున్నట్లు ఇరువురు నేతలు ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 20 బిలియన్ డాలర్లకు మించి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లూలా మాట్లాడుతూ.. పునరుత్పాదక ఇంధన సూపర్ పవర్‌తో డిజిటల్ సూపర్ పవర్ యొక్క సమావేశంగా తమ భేటీని అభివర్ణించారు. ఆరోసారి భారత్‌లో పర్యటిస్తుండటం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. మోడీ తమకు ఎంతో ప్రియమైన నేస్తమని పేర్కొన్నారు. దక్షిణార్ధ గోళంలో మన ఇరు దేశాలు..అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని, అంత మాత్రమే గాక మన రెండూ మెగా వైవిధ్యభరితమైన దేశాలని తెలిపారు. సాంస్కృతిక పరిశ్రమకు కేంద్రాలని పేర్కొన్నారు. మోడీ, తాను బహుపాక్షికత, శాంతిని కాపాడతామని తెలిపారు. ఈ సమావేశం సమకాలీనత, పరస్పర విశ్వాసాన్ని చూపిస్తుందన్నారు. ప్రధాని మోడీ మాట్లాడుతూ..లాటిన్ అమెరికాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్ ఉందన్నారు. లూలా స్ఫూర్తిదాయక నాయకత్వం, దార్శనికతతో ఇరు దేశాలు ప్రయోజనం పొందుతున్నాయని, ఇది విన్-విన్ భాగస్వామ్యమని ఆయన అభివర్ణించారు. రెండు దేశాలు కలిసి పనిచేస్తే.. వర్ధమాన ప్రపంచం మరింత బలపడుతుందన్నారు. ఉగ్రవాదం, దానికి మద్దతిచ్చేవారు మానవాళికి శత్రువులని ఈ రెండు దేశాలు అంగీకరిస్తున్నాయని మోడీ చెప్పారు.